

# పుష్ప అంటే ఫైర్

ఓటీటీ హిట్

## బహిష్కరణ

**ఓటీటీ:** జీ5 (స్ట్రీమింగ్ అవుతున్నది)
**నటీనటులు:** అంజలి, రవీంద్ర విజయ్, అనన్య నాగళ్ల, శ్రీతేజ్
**దర్శకుడు:** ముఖేశ్ ప్రజాపతి

వైవిధ్యమైన క్యారెక్టర్లతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరోయిన్ అంజలి. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో చిన్నచిన్న క్యారెక్టర్లు చేసిన ఆమె కొన్నాళ్ల నుంచి లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తూ బిజీగా మారింది. ఇక, ఓటీటీల హవా పెరిగిన తర్వాత సినిమా, సిరీస్‌లతో అభిమానులను అలరిస్తున్నది. మెగా పవర్‌స్టార్ రాంచరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గేమ్‌ఛేంజర్'లో ఆమె నటిస్తున్న సంగతి తెలిసిందే! తాజాగా అంజలి నటించిన వెబ్‌సిరీస్ బహిష్కరణ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చింది. దీని కథేంటంటే...

గుంటూరు జిల్లా పెద్దపల్లి గ్రామం సహా చుట్టుపక్కల ఊళ్లకు పెద్దమనిషి శివయ్య (రవీంద్ర విజయ్). ఆ ఊళ్లలో జనాలకు ఆయన మాట అంటే శాసనం. డబ్బు, అధికారాన్ని అడ్డం పెట్టుకుని మహిళల జీవితాలను శివయ్య నాశనం చేస్తుంటాడు. మరోవైపు పుష్ప (అంజలి) అదే ఊళ్లో వేశ్యగా ఉంటుంది. శివయ్యకు ఆమెతో సంబంధం ఉంటుంది. అతని దగ్గర పనిచేసే దర్శి (శ్రీతేజ్) పుష్పతో ప్రేమలో పడతాడు. ఆమె కూడా అతని ప్రేమను అంగీకరిస్తుంది. దీంతో ఇద్దరూ పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. అయితే దర్శి మాత్రం లక్ష్మి (అనన్య నాగళ్ల)ను పెండ్లి చేసుకుంటాడు. పుష్పను ప్రేమించిన దర్శి మరో అమ్మాయి మెడలో తాళి ఎందుకు కట్టాల్సి వచ్చింది? అతను జైలుకు ఎందుకు వెళ్లాడు? జైలు నుంచి తిరిగి వచ్చాక ఏం చేశాడు? శివయ్యపై పుష్ప ఎలా ప్రతీకారం తీర్చుకుంది? అనేది మిగిలిన కథ.





# సద్గురువులే శరణ్యం

నేడు గురు పూర్ణిమ

**గురువు పట్ల ఆదరణ, అంకితభావం, గౌరవాన్ని తెలుపుతూ భక్తి శ్రద్ధలతో వేడుకను జరుపుకొనే రోజే 'గురు పూర్ణిమ'. గురువు అనే పదంలో, 'గు' అంటే అజ్ఞానమని, 'రు' అంటే ఆ అజ్ఞానాన్ని నాశనం చేసే వ్యక్తి అని అర్థం. ఆ విధంగా 'గురువు' అంటే అత్యంత జ్ఞాన సంపన్నులు, జీవుని హృదయంలోని అజ్ఞానాన్ని పారదోలి జ్ఞానం వైపు నడిపిస్తారని అర్థం. ఆది గురువులైన కృష్ణద్వైపాయన వ్యాస భగవానుడు ఉత్తరాషాఢ నక్షత్రంలోని ఆషాఢ శుక్ల పూర్ణిమ తిథిన ఈ లోకంలో అవతరించినందు వల్ల, ఆ తిథి 'గురు పూర్ణిమ'గా, 'వ్యాస పూర్ణిమ'గా ప్రసిద్ధి గాంచింది.**



ప్రపంచవ్యాప్త హరే కృష్ణ ఉద్యమ సంస్థాపక ఆచార్యులైన శ్రీల ప్రభుపాదులు గురు పూర్ణిమను గూర్చి ఇలా వివరించారు... 'ఆధ్యాత్మిక గురువుకు గౌరవం ఇచ్చే ఈ విధానం అన్ని వైదిక సంప్రదాయాల్లో ఆచరణలో ఉన్నప్పటికీ, గౌడీయ సంప్రదాయంలో మాత్రం ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక గురువు పుట్టినరోజున వారికి సవినయంగా సన్మాన, వందన, భక్తిపూర్వక ఉపచారాలతో కృతజ్ఞతలను తెలియజేస్తాం. ఆ ప్రత్యేకమైన శుభ క్షణాన్ని వ్యాసపూజగా జరుపుకొంటాం.

### గురువు ప్రాముఖ్యం

జీవితంలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల ప్రాముఖ్యాన్ని రాబోయే తరాలకు వివరించడానికి గురు పూర్ణిమ ఎంతో అనువైనది. పూర్వం విద్యార్థులంతా గురువుగారి ఆశ్రమంలోనే ఉంటూ విద్యను అభ్యసించేవారు. గురువు కూడా ఉచితంగా బోధించేవారు. గురువుగారి ప్రతి మాట శిష్యులకు శిరోధార్యమై ఆజ్ఞగా స్వీకరించేవారని చరిత్రలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. గురువు ప్రసాదించిన విజ్ఞానం ఏకకాలంలో శిష్యునికి నిత్య జీవన విధానాన్ని తెలపడమే గాక, దేవాది దేవుడైన శ్రీకృష్ణుని పట్ల స్వచ్ఛమైన భక్తియుత సేవాభావాన్ని పెంపొందించి జీవిత పరమావధి వైపు నడిపిస్తుంది.


### ఎవరు... ఎలాంటివారిని ఆశ్రయించాలి?

**తస్మాద్గురుం ప్రపద్యేత జిజ్ఞాసుః శ్రేయ ఉత్తమమ్**
**శాబ్దే పరే చ నిష్ణాతం బ్రహ్మణ్యుపశమాశ్రయమ్**

జీవిత పరమార్థాన్ని గురించి జ్ఞానాన్ని పొందాలనే తపన ఉన్నవాడు గురు శరణం పొందాలి. (శ్రీమద్భాగవతం 11.2.21). అయితే, ఇక్కడ 'మనం ఆశ్రయించదగిన ప్రామాణిక గురువును ఎలా కనుక్కోగలం?' అనే ప్రశ్న తలెత్తుతుంది. దీని కోసం గురువును ఆశ్రయించే ముందే ఓ చిన్న పరీక్ష చేయడం ఎంతో ముఖ్యం. అసమర్థులైన వారిని ఎప్పుడూ ఆశ్రయించకూడదు. దీని గురించి ముండకోపనిషత్తులో (1.2.12).. తద్-విజ్ఞానార్థం స గురుం ఏవాభిగచ్ఛేత్ శ్రోత్రియం బ్రహ్మ- నిష్ఠం అని వివరించారు. ఇందులో ముఖ్య పదం 'శ్రోత్రియం', అంటే ఒక ప్రామాణిక గురు-శిష్య పరంపరకు చెందినవారు అని అర్థం. గురువు లేకుండా తాను ఆత్మసాక్షాత్కారం పొందానని ఎవరైనా వాదిస్తే, అతను నకిలీ గురువే. ఇస్కాన్ సంస్థాపక ఆచార్యులు.. పూజ్యశ్రీ ఎ.సి. భక్తివేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల వారు అలాంటి బ్రహ్మనిష్ఠ గల శిష్య పరంపరకు చెందినవారు. అంటే, సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుని నుంచి ఆరంభమై.. ఆ పరంపరలోని అనేక ఆధ్యాత్మిక గురువుల ద్వారా అందించబడిన విజ్ఞానం యథాతథంగా శ్రీల వ్యాసదేవ, శ్రీ చైతన్య మహాప్రభు, శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ ఠాకూరుల ద్వారా శ్రీల ప్రభుపాదుల వారిచే మనకు సంక్రమించింది. శ్రీల ప్రభుపాదుల లాంటివారే మనకు శరణ్యం. కాబట్టి, ఈ గురు పూర్ణిమ శుభ సందర్భంగా, ప్రతి ఒక్కరమూ మన గురువులను గౌరవిద్దాం.

శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజి
93969 56984





# శుభం కార్డు మిస్సింగ్

## ...టూ బీ కంటిన్యూడ్

**డైరెక్టర్:** రెడీ.. కెమెరా.. యాక్షన్!!

**హీరో:** (పొట్టలో దిగిన కత్తిని పట్టుకుని)

అమ్మా.. నీకిచ్చిన మాట నిలబెట్టుకున్నా.

నీ ఒడిలో హాయిగా కన్ను మూస్తున్నా. ఈ జన్మకిది చాలు.

**తల్లి:** బాబూ!!! నా ఆయువు కూడా పోసుకుని నువ్వు నూరేండ్లూ బతకాలి.

**హీరో:** నాకంత టైమ్ లేదమ్మా.. లేదు.. లేదు..!! తల పక్కకు వాల్చేశాడు! (కట్ చేస్తే..)

చుట్టూ హీరో ఫ్యామిలీ.. హీరో కండ్లు ఇంకా తెరిచే ఉన్నాయి.. తల్లినే చూస్తూ..!!

థియేటర్ మొత్తం నిశ్శబ్దం.. సీన్ ఫ్రీజ్ అయ్యింది.. తెరపై జూమ్ అవుట్ అవుతూ..

శుభం.. The End! కార్డు!! థియేటర్ లైట్స్ ఆన్ అయ్యాయ్.

కండ్లు తుడుచుకుంటూ కొందరు.. హీరో చనిపోకుండా ఉంటే బాగుండు..

అని ఇంకొందరు.. ఇంటి ముఖం పట్టారు!!

### అవును..

అయితే.. ఇప్పుడేం చేయమంటారు? మాకంత ఓపిక లేదంటారా? యస్.. నేటి తరం డైరెక్టర్లకు కూడా ఓపిక లేకుండాపోయింది. అందుకే.. 70 ఎంఎం స్క్రీన్ నుంచి 'శుభం' కార్డు గల్లంతయ్యింది. పార్టు పార్టులుగా సినిమా పలకరిస్తున్నది. అందుకేనేమో.. తరాల అంతరాల నడుమ తెరమరుగైన 'శుభం' కార్డును తలుచుకోవాల్సి వస్తున్నది.

ఓ రెండు తరాలు వెనక్కి వెళ్తే.. తెలుస్తుంది.. క్లైమాక్స్ అనగానే ఈల వేసుకుంటూ పోలీసులు వచ్చేసేవారు. 'రండి ఇన్‌స్పెక్టర్ గారూ ఈ దుర్మార్గులను జైల్లో వేయండి' అని మనసు మార్చుకున్న సూర్యకాంతం అంటే 'మిస్టర్ యువార్ అండర్ అరెస్ట్' అని ఇన్‌స్పెక్టర్ అనడమూ, పండ్లు పటపట కొరుకుతూ రాజనాల జైలుకు వెళ్లిపోవడమూ జరిగిపోయేవి. లేదంటే చేసిన తప్పులకు చింతిస్తూ 'నాలాంటి వాడికి ఈ సభ్య సమాజంలో ఉండే హక్కు లేదు' అంటూ నాగభూషణం నట విన్యాసం ప్రదర్శిస్తూ బేడీలు వేయించుకునేవాడు. మరోవైపు.. ఎన్టీ రామారావు 'పెద్దయ్యా, ఎంత చెడ్డా బావ మనవాడు. అందరూ మన వారు అన్నది మరచిపోయాడు. అనవసరంగా జైలుపాలు చేస్తే మనమే బాధపడాలి కదా' అని ఎస్వీఆర్‌ని కన్విన్స్ చేస్తే.. రేలంగి 'నన్ను క్షమించు బావా' అనేవాడు, జామీను మీద విడిపించుకునేవారు.

ఇలా ఏది ఏమైనా చివరికి అందరూ కలిసి ఓ ఫ్యామిలీ ఫ్రేమ్‌లోకి వచ్చేవారు. ప్రేక్షకుల కడుపు నిండిపోయేది. రెండున్నర నుంచి మూడు గంటలపాటు సినిమా జీవితచక్రంలో నలిగిన ప్రేక్షకుడికి అదో సంతృప్తి. అందుకే అప్పట్లో డైరెక్టర్లు ఒక్కో తీరుగా శుభం కార్డు వేసేవారు. అంటే.. ఇప్పుడు బిగినింగ్‌లో.. ఓ రాజముద్ర వేస్తున్నారుగా.. 'ఇట్స్ ఏ రాజమౌళి ఫిల్మ్'.. అని! అలాగన్నమాట. ఇప్పటి డైరెక్టర్లు.. కథ ముగింపు కన్నా ఎక్కువగా హీరో ఇంట్రొడక్షన్‌లే పద్ధతిగా ప్లాన్ చేస్తున్నారు. ఇక ఇంటర్వెల్ బ్యాంగ్ అయితే.. చెప్పక్కర్లేదు. మరి, క్లైమాక్స్ సంగతేంటి?.. 'శుభం' కార్డు పడే వరకూ ఆడియన్స్ కూర్చుంటున్నారా? లేచి నడుచుకుంటూ వెళ్లి డోర్ దగ్గర ఆగుతున్నారా? పార్టు 2 ఎలాగూ ఉందిగా.. దాంట్లో చూద్దాంలే అనుకుంటూ జేబులోకి చేతులు పోనిచ్చి.. అందులో ఉన్న ఫోన్ పైకి తీసి.. చాట్ చేస్తూ ఎటో వెళ్లిపోతున్నారా? 'శుభం' కార్డు చూసే ఓపిక లేక కాదు! సినిమాకు 'ది ఎండ్' ఉంటేగా!

### కథ కంచికి.. టెక్నాలజీ ముందుకి!!

'మీ సినిమాల సక్సెస్ వెనక రహస్యం ఏంటి' అని ఎవరైనా హీరో లేదా డైరెక్టర్‌ని అడిగితే.. ఎక్కువ శాతం 'మంచి కథ' అని చెబుతారు. ఓ కథ బాగుంది అన్నామంటే.. కచ్చితంగా దానికి మంచి ముగింపు ఉన్నట్టే. సినిమాల విషయానికి వస్తే డైరెక్టరే కెప్టెన్. సో.. ఆ క్రెడిట్ మొత్తం దర్శకుడికే దక్కుతుంది. అందుకే చాలా మంది డైరెక్టర్లు వారిదైన పద్ధతిలో కథకు చివర్లో శుభం కార్డులు వేసేవాళ్లు. అదీ చూశాకే- హమ్మయ్యా!! అంటూ కథ తాలూకూ ఎమోషన్స్‌ని కళ్లలో నింపుకొని వెళ్లేవారు ప్రేక్షకులు. పోను.. పోనూ.. చేతిలోకి స్మార్ట్‌ఫోన్.. దానికో కెమెరా కన్ను వచ్చేసరికి కథ కంచికిపోయి.. టెక్నాలజీ ముందుకొచ్చింది. కథలో తీరుతెన్నుల్ని.. మార్చేస్తూ.. బ్లాక్ అండ్ వైట్ నుంచి రంగుల్లోకి వచ్చేశాం. ఈ క్రమంలోనే.. సింపుల్ 'శుభం' కార్డు.. కాస్త క్రియేటివ్‌గా మారింది. త్యాగాలు.. పోలీసుల్ని దాటుకుని పెళ్లి మంటపాలు, గుడి ఆవరణల్లోకి మారింది. హీరో.. హీరోయిన్ మెడలో తాళికట్టగానే.. ఫ్యామిలీ మొత్తం వాట్సాప్‌లో మనం వాడే ఎమోజీల మాదిరిగా ఫన్ ఎక్స్‌ప్రెషన్స్ పెట్టేవాళ్లు. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు లాంటివాళ్లు.. సీన్‌ని ఫ్రీజ్ చేసి.. శుభం అని వేస్తే.. పెళ్లిసందళ్లని ప్రేక్షకులు ఇంటిదాకా తీసుకెళ్లేవారు.

### మడిషన్నాక కాసింత..!!

యస్.. కాలంతోపాటు డైరెక్టర్స్ రూటు మారుతూ వచ్చింది. కథలతో కల్చర్, కట్టుబాట్లు చెప్పాలని కొందరు.. కథంటే హాయిగా నవ్వుకోవడమే అని ఇంకొందరు.. కథంటే నవరసాలు కలగలిపిన నాటకం అని మరికొందరు.. ఈ క్రమంలోనే వారి కథల తాలూకు భావాల్ని శుభం కార్డుపై రీప్లేస్ చేశారు. కళాతపస్వి కె.విశ్వనాథ్ సినిమాల్ని తీసుకుంటే.. చివర్లో No End for Art!! అని కథలో ఫ్రేమ్‌ని ఫ్రీజ్ చేసేవారు. 'నవ్వడం ఒక భోగం.. నవ్వించకపోవడం ఒక రోగం..' అని ఎవరైనా అంటే.. కచ్చితంగా వాళ్లు జంధ్యాల ఫ్యాన్సే. హాస్యరసంతోనూ చక్కని కథల్ని వండి వార్చిన ఆయన.. చివర్లో 'నవ్వండి.. నవ్వించండి.. నవ్వు ఆరోగ్యకరం' అని శుభం కార్డుపై నవ్వుల పువ్వుల్ని పూయించారు. మరో వైపు.. ఈవీవీ.. 'టాటా' అంటూ.. కొన్ని సార్లు.. పళ్లూ, ఫలాలలో ఊరించే గడ్డం గురువు రాఘవేంద్రరావు 'సర్వేజనాః సుఖినో భవంతు' అంటూ ప్రేక్షకుల్ని శుభం కార్డుతో దీవించి పంపేవారు. యాక్షన్ కింగ్ అర్జున్ లాంటోళ్లు.. 'జైహింద్' అంటూ దేశభక్తిని చాటే ప్రయత్నం చేశారు.

### ఇప్పుడు 'బ్రాండ్' తోనే బాయ్


సినిమా గురించి టాక్ మొదలైందంటే చాలు.. ఇప్పుడంతా బ్రాండ్‌లు, బడ్జెట్ల గురించే డిస్కషన్. అందుకేనేమో.. డైరెక్టర్లు, హీరోలు.. వారి తాలూకు ఇమేజ్‌లను దృష్టిలో పెట్టుకుని అన్నీ ప్లాన్ చేస్తున్నారు. సినిమా ప్రమోషన్స్ దగ్గర్నుంచి అంతా సెన్సేషనే. ప్రీరిలీజ్ ఈవెంట్‌లు, ప్రమోషన్స్‌తో కథను ముందే చెప్పేస్తున్నారు. రిలీజ్ అవ్వగానే రివ్యూలతో కథని అంగట్లో ఉంచుతున్నారు. ఇలా అన్ని అశుభాలు దాటుకుని.. హిట్‌టాక్ తెచ్చుకుని.. రికార్డులు సృష్టించే బిజీలో పడి.. శుభం కార్డును చూపించే ఆలోచన డైరెక్టర్లు ఎప్పుడో డిలీట్ చేసుకున్నట్టున్నారు. ఇక కొందరైతే కథను ఎలా ముగించాలో తెలియకనో.. ముగిస్తే ఇంకో కథ దొరకదనే బెంగతోనో.. 'పార్ట్ 2' ఉందంటూ.. ప్యాక్ అప్ చెబుతున్నారు. హుం.. ఇంకేం చేద్దాం.. మంచి కథ ఏదైనా వస్తే.. చివరి వరకూ కూర్చుని.. శుభం కార్డు పడుతుందేమో చూద్దాం. డైరెక్టర్లూ.. కథకు మంచి శుభం కార్డు వేస్తే.. ఆ కిక్కే వేరబ్బా!!

... ఆర్యన్ ప్రజాపతి



# నేనలా అనలేదు బాబోయ్!

**నటీనటులు** ఏం మాట్లాడినా, ఏం చేసినా ప్రాధాన్యం సంతరించుకుంటాయి. అలాగే, వాళ్లు మాట్లాడింది పాజిటివ్ అయినా సరే కొన్నిసార్లు నెగెటివ్ అర్థాలు వచ్చేస్తుంటాయి. ఈ క్రమంలో వాళ్లు ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ఇటువంటి సమస్యే ఎదుర్కొన్నానని చెప్పుకొచ్చింది నటి, మోడల్ మాళొబిక బెనర్జీ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాళొబిక తనకు ఎదురైన చేదు అనుభవం గురించి షేర్ చేసుకుంది. టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండతో 'నీ వెనకాలే నడిచి' అనే ప్రైవేట్ సాంగ్ చేసిందామె. ఈ సందర్భంగా ఆమె చేసిన కామెంట్లు వైరల్ అయ్యాయి. 'విజయ్‌కి హిందీ అంటే పెద్దగా ఇంట్రెస్ట్ ఉండదని చెప్పాను. ఆ మాటను మీడియాలో వక్రీకరించారు. హిందీ అంటేనే తనకు గిట్టదని, ఆ భాషను అసహ్యించుకుంటాడని రాస్తున్నారు. అసలు నేను అలా అనలేదు. కానీ, ఎంతో దారుణంగా రాస్తున్నారు. ఈ రాతల కారణంగా మంచి స్నేహితుడికి దూరమయ్యాను. సరదాగా అన్న మాటలను సీరియస్‌గా రాశారు. ఆ కామెంట్లు చదివిన తర్వాత విజయ్ టచ్‌లోకి రావడం లేదు. ఆయన్ను ఇరికించాలనో, తప్పుపట్టాలనో ఆ మాటలు అనలేదు' అని వాపోయింది మాళొబిక.



# అచ్చంగా మన్మథుడే!

**సీనియర్** హీరోయిన్, అందాల తార ఖుష్బూ టాలీవుడ్‌లో హీరోయిన్‌గా పాపులారిటీ తెచ్చుకున్నారు. ఒకనాడు తెలుగు అగ్రహీరోల సరసన నటించారు. ఇటీవల టాలీవుడ్ హీరోపై ఆమె చేసిన కామెంట్లు 'హవ్వా!' అనుకునేలా ఉన్నాయి. నాగార్జునతో రొమాన్స్ చేయాలని ప్రతి మహిళా కోరుకుంటారని వ్యాఖ్యలు చేశారామె. 'కింగ్ నాగార్జునకు ఇప్పుడు 65 ఏండ్లు. కానీ ఇప్పటికీ ఆయన 30 ఏండ్ల కుర్రాడిలా కనిపిస్తారు. ఇంకా చెప్పాలంటే నాగార్జున ఇప్పుడే మరింత అందంగా ఉన్నారు. మన్మథుడు అనే ట్యాగ్‌లైన్‌కు ఆయన న్యాయం చేస్తున్నారు. బిగ్‌బాస్ షోలో నాగార్జున మరింత స్టైలిష్‌గా ఉంటారు. 1986లో ఆయనతో కెప్టెన్ నాగార్జున సినిమా చేశాను. అప్పటికంటే ఇప్పుడు ఆయన మరింత స్టైల్‌గా మారారు' అని వ్యాఖ్యానించింది ఖుష్బూ.



# నేను నాలాగే కనిపిస్తా

**చిరంజీవి,** వెంకటేష్, నాగార్జున, బాలకృష్ణ సరసన నటించిన నటి టబు. బాలీవుడ్‌లో తాజాగా క్రూ అనే సినిమాతో అలరించింది. ప్రస్తుతం అజయ్ దేవగణ్‌తో 'ఔరోఁ మే కహాఁ ధమ్ థా'లో కనిపించనుంది. నీరజ్ పాండే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఆగస్టు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో వీఎఫ్ఎక్స్ ద్వారా యంగ్ లుక్‌లో కనిపించబోతున్నారా అనే ప్రశ్నకు టబు ఇచ్చిన సమాధానం వైరల్ అవుతున్నది. 'తెరపై టీనేజ్ అమ్మాయిలా కనిపించాలని లేదు. ప్రస్తుతం నా లుక్ ఎలా ఉందో స్క్రీన్‌పై కూడా అలాగే కనిపించాలని అనుకుంటాను. నా వయసు తగ్గించి చూపించే సాహసాన్ని దర్శకుడు ఈ సినిమాలో చేయలేదు. తమ వయసుకు తగిన పాత్రల్లోనే ఇదివరకు నటీనటులు కనిపించేవారు. అయితే, ప్రస్తుతం వయసు ఎక్కువ ఉన్నవాళ్లు కూడా యంగ్‌గా కనిపించే పాత్రలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. రొమాంటిక్ జానర్‌లో తెరకెక్కిన ఈ సినిమాలో 30 ఏండ్ల అమ్మాయిలా కనిపించ లేదు' అని చెప్పుకొచ్చింది టబు.